క్లుప్తంగా

నేడు మోటారు సైకిళ్ల వేలం

అంబాజీపేట: ఐదు మోటారు సైకిళ్లకు అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. అన్‌క్లెయిమ్డ్ మోటారు సైకిళ్లు అయిన హీరో హోండా గ్లామర్, హోండా యాక్టీవాలు 2, బజాజ్ పల్సర్, సీటీ 100లకు బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు ఈ వేలంలో పాల్గొనవచ్చని ఎస్సై కోరారు.

వైభవంగా వరాల నాగమ్మ వార్షికోత్సవం


గంటిలో వరాల నాగమ్మ

కొత్తపేట: మండలంలోని గంటి గ్రామంలో వేంచేసిన స్వయంభూ వరాల నాగమ్మ తల్లి అమ్మవారి దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. 3 రోజుల పాటు వివిధ కార్యక్రమాలతో ఆ గ్రామం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నుంచి కార్యక్రమాలు ప్రారంభించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం పలువురు గ్రామ పెద్దలు, భక్త దంపతులచే ఆలయ అర్చకుడు రామశాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితులు గణపతి హోమం, చండీహోమం నిర్వహించారు. గంటి పరిసర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శనివారం ఉదయం పూర్ణాహుతి, అనంతరం 11 గంటల నుంచి అన్నసమారాధన కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా ప్రతిష్ఠాపన మహోత్సవాలు

మామిడికుదురు: లూటుకుర్రులో నూతనంగా నిర్మించిన ఆలయంలో పోశమ్మ అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ బాదంపూడి సోమేశ్వర శర్మ ఆధ్వర్యంలో గోకవరపు గణాధిపతి, లక్ష్మీ సరోజ, గోకవరపు పెరుమాళ్ల స్వామి, శ్రీవిద్య దంపతులు పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. నూతన విగ్రహాలతో యాగశాల ప్రవేశం, భూతబలి, శాల ప్రదక్షిణం, దీప ప్రజ్వలన, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య మార్జనలు, దీక్షాధారణ, ఋత్విక్ వరుణలు, త్రిశూల పూజ, ప్రధాన కలశ స్థాపన, మూలమంత్ర హోమాలు తదితర పూజలను వైభవంగా జరిపించారు. పలువురు భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

పి.గన్నవరం: స్థానిక ఏజీ రోడ్డులో వేంచేసిన లక్ష్మీ కనకదుర్గమ్మ వారి ఆలయ 30వ వార్షిక మహోత్సవాల సందర్భంగా శుక్రవారం భక్తులకు భారీ స్థాయిలో అన్నసమారాధన చేశారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పలువురు భక్త దంపతుల ఆధ్వర్యంలో మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. కార్యక్రమాలకు ఆలయ కమిటీ నాయకులు ఆధ్వర్యం వహించారు.

కుంభమేళాకు ఆఖరి బస్సు

రావులపాలెం: ప్రయోగరాజ్ కుంభమేళాకు వెళ్లేందుకు ఆఖరి బస్సును 23 తేదీన రావులపాలెం డిపో నుంచి ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ జీజీవీ రమణ శుక్రవారం తెలిపారు. 8 రోజుల యాత్ర స్పెషల్‌గా సూపర్ లక్జరీ బస్సును భక్తులు సౌకర్యార్థం ఆదివారం ఉదయం 11 గంటలకు రావులపాలెం నుంచి బయలుదేరుతుందన్నారు. టికెట్ ధర మనిషికి రూ.10,500 (భోజనంతో సహా) నిర్ణయించినట్టు డీఎం తెలిపారు. భువనేశ్వర్, పూరి, కోణార్క్, ప్రయాగరాజ్ కుంభమేళా, వారణాసి, గయ, బుద్ధగయ, అరసవెల్లి, శ్రీకూర్మం దర్శనాల అనంతరం రావులపాలెం చేరుతుందన్నారు. కుంభమేళాకు ఇదే ఆఖరి బస్సు అని భక్తులందరూ వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు, టికెట్ రిజర్వేషన్‌కు 9959225537, 7382911871 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జాబ్‌మేళాకు 32 మంది హాజరు

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివీస్ ల్యాబొరేటరీ లిమిటెడ్ బల్క్ డ్రగ్ కంపెనీ శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు 32 మంది హాజరయ్యారు. ఫార్మసీ, కెమిస్ట్రీ అభ్యర్థులకు రాత పరీక్ష, మౌలిక పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు వారం రోజుల్లో నియామక పత్రాలు పంపిస్తామని హెచ్‌ఆర్ పూర్ణప్రసాద్ తెలిపారు.

చిన్నారుల అభివృద్ధికి కృషి చేయాలి

అంబాజీపేట: చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వీఎస్‌వీ మహాలక్ష్మి, ఎస్.వెరినమ్మ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ పూర్వ ప్రాథమిక విద్యపై అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం శుక్రవారం మూడో రోజు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పిల్లల పోషణతో పాటు విద్యపై మక్కువ పెంచేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు జరపాలన్నారు. డీఆర్పీలు సీహెచ్ వెంకటసతీష్, బీఆర్‌ఎన్ శ్రీనివాస్, డీఎస్ రమేష్‌లు శిక్షణనిచ్చారు.

అచ్చం.. అలాగే!


కవలలు

- నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం
- ఒకే పోలికతో తికమక పెట్టిన సందర్భాలు అనేకం
- అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్న కవలలు

కొత్తపేట: ఒకే పోలిక.. ఒకే డ్రెస్. ఒకరిని చూస్తే మరొకరిని చూసినట్లే! జిరాక్స్ టూ జిరాక్స్... ఇలా చెప్పుకుంటూ పోతే కవలల గురించి ఎన్నో అంశాల్ని పోల్చి చెప్పినా తక్కువే అవుతుంది. తల్లిగర్భంలో ఒకేసారి, ఒకే రూపంతో మొదలై క్షణాల వ్యవధిలోనే బయటి ప్రపంచానికి పరిచయమై ఒకే ముఖకవళికలతో అందరినీ అమితంగా ఆకట్టుకోవడం కవలల ప్రత్యేకత. సృష్టిలోని ఎన్నో వింతలు, అద్భుతాల్లో కవలల జననం కూడా ఒకటిగా ఉంటోంది. బాగా తెలిసిన వారు సైతం కవలలను ఎవరెవరో పోల్చుకోవడం కాస్త ఇబ్బందిగానే ఉంటుంది. ఫలదీకరణలో వచ్చే మార్పుల కారణంగా కవలల జననం సంభవిస్తుందని వైద్యనిపుణులు అంటున్నారు. ముద్దులొలికే పసికందులను చూడగానే వారి పేర్లను కూడా దరిదాపు ఒకేలా పెట్టడం పరిపాటిగా మారింది. 'వర్షిణి-వర్ధిని', 'వినయ్-వివేక్', 'రామ-లక్ష్మణ్', 'రమేష్-నరేష్' లాంటి పేర్లతోనూ తికమక పట్టించేస్తుంటారు. అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనం.

కవలల దినోత్సవ ఆవిర్భావమిలా...

ప్రథమంగా కవలల దినోత్సవాన్ని పోలెండ్ దేశస్థులు 1976లో నిర్వహించారు. మోజెస్, విల్కాక్స్ అనే కవల సోదరులు తాము నివసిస్తున్న ఊరికి 'ట్విన్స్‌బర్గ్' అని పేరు పెట్టుకున్నారు. **కవలలనే పెండ్లాడి, మళ్లీ కవలలకే జన్మనిచ్చారు. దురదృష్టకరమైన విషయమేమంటే ఒకే రకమైన వ్యాధి సోకి వారిద్దరూ ఒకే రోజు మరణించారు.** వీరి గుర్తుగా ప్రతి ఫిబ్రవరి 22న అంతర్జాతీయ కవలల దినం జరపడం పరిపాటిగా మారింది.

ఇద్దరిదీ ఒకే మనస్తత్వం..

ఎప్పుడూ చురుగ్గా ఉండే వినయ్-వివేక్ అనే అన్నా, తమ్ముడు కొత్తపేట మండలం వాడపాలెం గ్రామానికి చెందిన చింతపల్లి పళ్లంరాజు-సూర్యావతి దంపతుల కుమారులు. కొత్తపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఏడో తరగతి చదువుతున్నారు. వీరిద్దరూ చదువు, ఆట పాటల్లోనే కాదు పడుకోవడంలో కూడా ఒకే రీతిలో పడుకుంటారు. ఇది మాత్రం ఆ తల్లిదండ్రులకు అంతుబట్టని ఆశ్చర్యం. ఇద్దరూ ఒకేరోజు అనారోగ్యానికి గురవుతారు.


వినయ్-వివేక్

విద్యార్థులకు క్విజ్ పోటీలు


ముక్తేశ్వరంలో విజేతలను అభినందిస్తున్న ఎంఈఓలు

మామిడికుదురు: ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ ఫోరం, జిల్లా సైన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయిలో క్విజ్ పోటీలు జరిగాయి. మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ పోటీల్లో మండలంలోని 8, 9 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఈఓ ఎస్.లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం సీహెచ్ నిరంజని ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. 8వ తరగతి విభాగంలో కె.గోవిందరాజు (కరవాక), దురె షహవర్ (పాశర్లపూడి), 9వ తరగతి విభాగంలో పి.చరణ్ కౌశిక్ (మామిడికుదురు), సీహెచ్ నవ్యకమలాశ్రీ (పాశర్లపూడి) ఈనెల 25న జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎంఈఓలు ఎస్.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు తెలిపారు.

అయినవిల్లి: ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ ఫోరం ఫారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆధ్వర్యంలో ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిది, తొమ్మిది తరగతులు చదువుతున్న విద్యార్థులకు మండల స్థాయిలో శుక్రవారం సైన్స్ క్విజ్ నిర్వహించారు. మండలంలోని 11 జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులు 20 మంది, తొమ్మిదో తరగతి నుంచి 18 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండల స్థాయిలో ఎనిమిదో తరగతి నుంచి మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఎం.శాలిని సత్యపద్మ, టి.సిరి(వీరవల్లిపాలెం), తొమ్మిదో తరగతి నుంచి కేఎస్‌వీఎస్ఆర్ చైతన్య(కొండుకుదురు) ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం బొక్కా యశ్విన్ (ముక్తేశ్వరం) దక్కించుకున్నారు. విజేతలుగా నిలిచిన నలుగురు విద్యార్థులు జిల్లా స్థాయిలో ఈ నెల 25న జరిగే సైన్సు క్విజ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలను ఎంఈవో-1 కె.వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 పి.శ్రీనివాస్, స్థానిక పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

రావులపాలెం: ఏపీపీఎస్‌టీఎఫ్ మండల స్థాయిలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ క్విజ్ పోటీల్లో నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ఎంఈఓలు నాగకుమార్, శ్రీనివాసరాజు తెలిపారు. తొమ్మిదో తరగతి విభాగంలో ప్రథమ విజేతగా టి.సుబ్రహ్మణ్యం (గోపాలపురం), ద్వితీయ విజేతగా టి.నిహారిక(ఊబలంక), 8వ తరగతి విభాగం నుంచి ప్రథమ, ద్వితీయ విజేతలుగా కె.తరుణ్, ఎ.జయశ్రీ (రావులపాలెం) నిలిచారు.

ఆదాయమంతా ఎక్కడికి పోతోంది!

మాజీ ఎంపీ హర్షకుమార్


పి.గన్నవరంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

పి.గన్నవరం: గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇప్పుడు ఈ కూటమి ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేకపోతుంది. అప్పుడు, ఇప్పుడు ఆర్థిక పరిస్థితికి పెద్ద తేడా లేదు. ఈ డబ్బు అంతా ఎక్కడికి పోతోందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ప్రశ్నించారు. టీడీపీ కార్యాలయాలపై దాడుల్లో కేసులు పెట్టడం తప్ప కూటమి ప్రభుత్వం ఇంకేమీ చేయడం లేదన్నారు. పి.గన్నవరంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థి జీవీ సుందర్‌ను గెలిపించాలని కోరారు. గత ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏరుదాటాక తెప్ప తగలేసినట్టు ప్రజలను మోసగించిందని అన్నారు. సూపర్-6 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తొలి సంతకం చేసిన డీఎస్సీ ఏదన్నారు. నిరుద్యోగ భృతి, విద్యార్థులకు తల్లికి వందనం, రైతులకు ఆర్థిక సాయం, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.15 వందలు, ఉచిత బస్సు, రూ.25 లక్షల భీమా వంటి పథకాలు ఎక్కడని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తొమ్మిది నెలల పాలనలో కేవలం ఒక గ్యాస్ సిలిండర్ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. నెమ్మదిగా ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చంద్రబాబు ఫొటోను మాత్రమే ఉంచి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలను తొలగిస్తున్నారని, తగిన సాక్ష్యాలతోనే తాను చెబుతున్నానని హర్షకుమార్ అన్నారు. సీఎం, డీసీఎంల మధ్య ఏమైనా పొరపొచ్చాలు ఉన్నాయేమోనని అన్నారు. దీంతో ఎక్కువ మంది జనసైనికులు మా అభ్యర్థి జీవీ సుందర్‌కు ఓట్లేసే పరిస్థితి కనబడుతోందని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 34వ నంబర్ స్థానంలో ఒకటో నెంబర్ వేసి సుందర్‌ను గెలిపించాలని కోరారు. ఇప్పుడు ఉన్న ప్రభుత్వాలు మాట మీద నిలబడేవి కాదని, వారికి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ఊడిమూడిలంక వద్ద వశిష్ఠ నదిపై వంతెనకు నిధులు తీసుకువచ్చి 2014లో తానే శంకుస్థాపన చేశానని గుర్తుచేశారు. ఇంతవరకూ పూర్తి కాకపోవడం తనకు బాధ కలిగిస్తోందనని అన్నారు. సమావేశంలో నాయకులు నూకపెయ్యి చిన్న, కత్తుల విక్టర్‌బాబు, నెల్లి దుర్గాప్రసాద్, విజయలక్ష్మి, మంగం సురేష్, మాతా సత్యనారాయణ, బత్తుల జనార్దన్, ఉచ్చుల శామ్యూల్, రమేష్ తదితరులు ఉన్నారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో నేతలు


అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో కొలువుదీరిన అభయాంజనేయస్వామి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామి వారి ఆలయాన్ని పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తమలపాకులు, గంధ సిందూరంతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి సన్నిధిలో ఏకాహం జరిగింది. ఈ పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పి.గన్నవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు వారికి స్వామి ఆశీర్వచనం అందజేశారు. వారిలో పాటు వైఎస్సార్ సీపీ నేతలు తోరం గౌతమ్, బొరుసు నర్సింహమూర్తి, కుడుపూడి విద్యాసాగర్, నెల్లి దుర్గాప్రసాద్, కటకంశెట్టి ఆదిత్య, తులా గోపాలకృష్ణ, తోరం భాస్కర్, బాలం రమేష్, పాలమూరి గోపాల్, ముత్యాల బాబులు తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

సాహిత్య కార్యక్రమాల షెడ్యూల్ విడుదల


కత్తిమండ ప్రతాప్

సఖినేటిపల్లి: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆరు నెలల పాటు నిర్వహించే సాహిత్య కార్యక్రమాల షెడ్యూల్‌ను శుక్రవారం సదరు వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ విడుదల చేశారు. ఈ మేరకు ఉయ్యూరువారి మెరకలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వివరించారు. ఈ నెల 23న భద్రాచలంలో పాలరాజ్ ఇంజినీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో 144వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం, మార్చి 9న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడలో నారీరత్న ఉమెన్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం, 23న రాజమహేంద్రవరంలో డాక్టర్ బోయి భీమన్న జీవితం, సాహిత్యంపై జాతీయ స్థాయి సదస్సు, ఏప్రిల్ 13న అమలాపురం, గుడివాడల్లో ఉగాది కవి సమ్మేళనాలు ఏర్పాటు చేసినట్టు ఆయన అన్నారు. కాగా మే నెలలో విజయవాడ వేదికగా అంతర్జాతీయ తెలుగు సాహిత్య మహాసభలు, జూన్ నెలలో హైదరాబాద్‌లో యూత్ ఫెస్ట్ పేరుతో యువజన కళా ఉత్సవాలు, విశాఖపట్నంలో శతాధిక కవి సమ్మేళనం, జూలై నెలలో మలేషియాలో ఇండో, మలేషియా అంతర్జాతీయ సాహిత్య సదస్సు, మైసూరులో కన్నడ తెలుగు ద్విభాషా సాహిత్య సదస్సు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. వీటితో పాటు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వేర్వేరు జిల్లాల్లో 24 గంటల పాటు కవి సమ్మేళనాలు ఏర్పాటు చేశామన్నారు.

గ్రామాల్లో సామాజిక సర్వే


సర్వే నిర్వహిస్తున్న లీగల్ టీం సభ్యులు, ఏఎన్‌ఎంలు

మలికిపురం: రాజోలు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామాల్లో డోర్ టు డోర్ సామాజిక సర్వే నిర్వహించారు. మలికిపురం మండలం చింతలమోరి, శంకరగుప్తం పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం తదితర గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటా సర్వేలో వికలాంగులైన బాలలను గుర్తించి వారి సమస్యలు సిబ్బంది అడిగి తెలుసుకుని వారికి పింఛన్, హెల్త్ ప్రాబ్లమ్స్ అడిగి తెలుసుకున్నారు. ప్యానెల్ లాయర్ వై.లక్ష్మీసుధా, పారా లీగల్ వలంటీర్ కె.ప్రసాద్, సీహెచ్ పార్వతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పి.మమత, కె.రోజా, చొప్పల పుణ్యవతి, ఏఎన్‌ఎంలు వరలక్ష్మి, కేపీఎల్ కుమారి, ఆశా వర్కర్లు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ

మామిడికుదురు: పీఎంశ్రీ పథకంలో భాగంగా మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులకు మంజూరైన యూనిఫామ్స్‌ను ఎంఈఓలు ఎస్.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు విద్యార్థులకు అందజేశారు. పాఠశాలలో హెచ్‌ఎం సీహెచ్ నిరంజని అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఈఓలు మాట్లాడుతూ వీటిని 36 మంది విద్యార్థులకు అందించారు. పీఎంశ్రీ పథకంలో మామిడికుదురు హైస్కూల్ ఎంపిక కావడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూపై దుష్ప్రచారాలు నమ్మొద్దు


ఎల్.అనిత

ఆలమూరు: జిల్లాలో మరెక్కడా బర్డ్ ఫ్లూ వైరస్ ఆనవాళ్లు లేవని, ఇప్పటి వరకూ ఒక కేసు కూడా నమోదు కానందున వదంతులు నమ్మవద్దని ఆలమూరు పశుసంవర్ధక సహాయ సంచాలకురాలు డాక్టర్ ఎల్.అనిత అన్నారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో నాటు కోళ్లు, బాయిలర్, ఫారం కోళ్లలో ఎక్కడా బర్డ్ ఫ్లూ వ్యాధి సోకలేదని నిర్ధారణ అయిందన్నారు. బర్డ్‌ఫ్లూ అనే వైరస్ పక్షుల నుంచి మనుషులకు సోకి ఆరోగ్యానికి హాని చేసే జునోటిక్ వ్యాధి కాదన్నారు. కోడిగుడ్లు, కోడి మాంసాన్ని 75 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉడికించి తినడం వల్ల ఎటువంటి వైరస్ అయినా జీవించే అవకాశం లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో బర్డ్‌ఫ్లూ పై తప్పుడు ప్రచారం చేయడం వల్ల కోళ్ల పెంపకం దారులు ఎన్నో ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కోళ్ల పరిశ్రమ అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంటోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బర్డ్‌ఫ్లూ వైరస్‌పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజలెవరూ నమ్మవద్దన్నారు. బర్డ్‌ఫ్లూ వైరస్‌పై ఏమైనా సందేహాలు ఉంటే సత్వరమే పశుసంవర్ధక శాఖ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో పౌల్ట్రీ పరిశ్రమలు ఉన్న అనపర్తి, మండపేట పరిసర ప్రాంతాల్లో వేలాది మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారని ఆమె గుర్తు చేశారు. బర్డ్‌ఫ్లూ వ్యాధిపై దుష్ప్రచారాల వల్ల ఇప్పటికే పౌల్ట్రీ రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటుండగా కార్మికులు జీవనోపాధి కోల్పోతున్నారన్నారు. సమాజం పట్ల బాధ్యత లేని కొంత మంది వ్యక్తులు చేసే ఇటువంటి దుష్ప్రచారాలను ప్రజలు, వినియోగదారులు నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని, చికెన్, కోడిగుడ్లు యథేచ్ఛగా తినవచ్చని ఏడీఏ సూచించారు.

తల్లి లాంటి తెలుగు భాషను రక్షించుకుందాం

ఘనంగా మాతృభాషా దినోత్సవం


ఆలమూరులో తెలుగు జాతిని పరిరక్షిద్దాం, తెలుగే మన వెలుగు ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


కొత్తపేట డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేపీ రాజు

ఆలమూరు: మాతృభాషతోనే తెలుగుజాతి మనుగడ సాధ్యమని బాలమందిరం వ్యవస్థాపకుడు కృష్ణశ్రీ, ప్రముఖ కవి, తెలుగు పండితుడు గౌరీ మల్లిక్, ప్రముఖ ప్రచురణ కర్త తురగా కృష్ణకుమార్ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బాలమందిరం ఆధ్వర్యంలో స్థానిక బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ వెత్సా లక్ష్మణరావు అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణశ్రీ మాట్లాడుతూ బెంగాలీ విద్యార్థుల పోరాటం వల్ల, వారి త్యాగాల వల్ల అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఏర్పడిందని వివరించారు. ప్రముఖ ప్రచురణకర్త కృష్ణకుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే తల్లి భాషపై పట్టు పెంచుకోవడం, మాట్లాడటం ద్వారా మన జాతి పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. తెలుగు ఉపాధ్యాయులు, ప్రముఖ కవి కామవరపు మల్లికార్జునరావు (గౌరీమల్లిక్) మాట్లాడుతూ శ్రద్ధగా వినడం, మననం, అధ్యయనం ద్వారా ఏ భాష అయినా సులువుగా నేర్చుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో నాగ సుందరీ దేవి, సుందర మాణిక్యం, రాధా కుమారి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: ప్రతీ ఒక్కరూ తెలుగును మాట్లాడటం ద్వారా తెలుగు భాష మనుగడను కాపాడుకోవాలని విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల తెలుగు శాఖ-ఆంగ్ల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ 'ఆంగ్లం-తెలుగు' రెండు భాషలను కూడా విద్యార్థులు అభ్యసించాలని, తెలుగు భాష మనుగడను కాపాడుకోవాలని, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలకు ఆంగ్లం వారధిగా ఉంటుందని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మలికిపురం: మాతృభాషతోనే ఏ రంగంలోనైనా రాణించగలమని ఎంవీఎస్‌జేయస్-ఆర్వీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఆనందమహనీ అన్నారు. కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.ఆనందమహనీ మాట్లాడుతూ 'ఏ వ్యక్తి అయినా ఏ రంగంలో అయినా విజయం సాధించాలంటే ముందుగా మాతృ భాషలో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ రవి, ఐక్యూఏసీ కో కోఆర్డినేటర్ పీడీకే ప్రసాద్, చిట్టాల సత్యనారాయణ, నక్కా రమేష్‌బాబు, కడలి శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజోలు: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని శుక్రవారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా వక్త చక్రవధానుల రెడ్డప్ప ధవేజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పద్యాలపన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, నల్లి రాజు, నాగరాజు, అశ్వని తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు


తొత్తరమూడిలో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ తదితరులు

అయినవిల్లి: పట్టభద్రుల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ తెలిపారు. శుక్రవారం అయినవిల్లి మండలంలో పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం, తొత్తరమూడిలో ఏర్పాటు చేసిన 197, 198, 199 ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. అయినవిల్లి మండలంలో మొత్తం 2514 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. వీరిలో 1463 మంది పురుషులు, 1051 మంది స్త్రీలు ఉన్నారన్నారు. పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఆర్ఐ రాయుడు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వీఆర్వోకి సత్కారం


వీఆర్వో అబ్బులును అభినందిస్తున్న తహసీల్దార్ శ్రీపల్లవి

పి.గన్నవరం: ఇటీవల బాపట్ల జిల్లా అద్దంకిలో జాతీయ స్థాయిలో జరిగిన కుంగ్‌ఫూ విభాగం కత్తి ప్రదర్శనలో పి.గన్నవరం మండలం వై.కొత్తపల్లి వీఆర్వో తాతపూడి అబ్బులు ప్రథమ స్థానం సాధించారు. దీంతో ఆయనను శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ పి.శ్రీపల్లవి దుశ్శాలువాతో సత్కరించారు. ఆమె మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో వీఆర్వో అబ్బులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి విద్యలు ఆరోగ్యానికి, ఆత్మరక్షణకు దోహద పడతాయని అన్నారు. కార్యక్రమంలో డీటీ ఎం.సత్యనారాయణ, ఆర్ఐ వెన్నపు డాంగే, వీఆర్వోల సంఘ నాయకులు పి.నర్సింహారావు, దొరబాబు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత


హెచ్‌ఎం సూర్యప్రకాశరావుకు క్రీడా సామగ్రి అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: అప్పనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం స్కూల్ విద్యార్థులకు రూ.20 వేలు విలువైన క్రీడా సామగ్రిని అందించారు. క్యారం బోర్డు, రింగ్స్, స్కిప్పింగ్ తాళ్లు, వాలీబాల్ తదితర క్రీడా సామగ్రిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బావరాజు సూర్యప్రకాశరావుకు అందజేశారు. హెచ్‌ఎం పూర్వ విద్యార్థులను అభినందించారు. పాఠశాల పురోభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.